**4-46**

## మున్నుడి

బంగారు మేడలో పవళించిన శ్రీవేంకటేశ్వరుని నిద్రలేపిన చెలియలు, ఆ పురుషోత్తమునికి సుగంధద్రవ్యాలతో నలుగుబెట్టి, పన్నీటితో స్నానం చేయించి, చక్కగా విసరి, కర్పూర ధూళిమెత్తి, కొప్పు దువ్వి, గొజ్జెంగపూలు ముడిచి, అనేక సొమ్ములు బెట్టి, తాంబూలమిచ్చి, తులసి మాలలు వేసి, ఆరగింపులు చేసి ఎలా సేవిస్తున్నారో చెబుతున్నారు అన్నమాచార్యులవారు.

సీ॥ బంగారు మేడలో పరమాత్ముడే వాడు
చెలులు సింగారాలు చేయరేల
తట్టు పుణుగు నూనె దట్టంబుగా నించి
కస్తూరి బాగుగా కలియబెట్టి
పన్నీట మజ్జనం బెన్నంగ సేయించి
వెట్టదీరగ వాన్కి వీవరేల?
కర్పూర గంధంబు కదు నిట్టె మెత్తరే
కొప్పులో ముడువరే 'గొజ్జెగలను'

తే॥ మేన సొమ్ములు నించరే మిలమిలయన
తులసిదండలు వేయరే నిలువుగాను
ఆరగింపులు సేయరే, అన్నమయ్య
పాట వినిపించి వేంకటపతికినిపుడు

రాగం : మధ్యమావతి

బంగారు మేడలలోన పరమాత్ముడు వాడే
సింగారాలు మీద మీద సేయరే చెలులు ॥బంగారు॥

తట్టుపుణుగుల నూనె తలనిండా నంటుకొని
గట్టిగా కస్తూరి అట కలివెట్టి
మట్టులేని పన్నీట మజ్జన మాడె నిదె
వెట్టదీర నిందరును విసరరే చెలులు ॥బంగారు॥



Scanned with CamScanner

కప్పురంపు గందవొడి కడునిట్టె మెత్తుకొని
కొప్పు దువ్వి ముడిచెను గొజ్జంగలెల్లా
తెప్పలుగా నించుకొనె తిరుమేను సొమ్ములెల్లా
దప్పిదీర విడమీరే తలకొని చెలులు ॥బంగారు॥

అలమేలుమంగను పురమందు నిట్టెనించుకొని
తులసి దండలు మోచె నిలువునను
చెలరేగి ఆరగించె శ్రీవేంకటేశ్వరుడు
కొలువున్నాడు మోహాలు గుప్పరే చెలులు ॥బంగారు॥

**భావామృతం :**

ఓ చెలులారా! అతగాడు బంగారపు మేడలో నివసించు, పురుషోత్తముడైన శ్రీవేంకటేశ్వరుడు. వానికి ఒకదానిని మించిన దింకొకటియైన అలంకరణలు చేయండి.

ఆ స్వామి తలకి (శిరోజములకు) తట్టు పుణుగు నూనెను (పునుగు పిల్లినుంచి వచ్చిన సుగంధపు నూనె) తలనిండా అంటి కస్తూరితో బాగుగా కలియబెట్టి, నలుగువలె బెట్టి స్వామికి ఆపై పన్నీటితో స్నానం చేయించండి. స్నానమైన తరువాత ఆయనకు వెట్టదీర (వేడిమి తగ్గిపోవునట్లు) మీరింతమంది చెలులు ఆయనకు వింజామరలతో విసరండి.

ఆ తరువాత ఎక్కువ కర్పూర ధూళితో ఆయనకు మెత్తి ఒళ్ళంతా సుగంధం వచ్చేట్లు చేయండి. ఆపైన ఆయన కొప్పును చక్కగా దువ్వి, 'గొజ్జెంగలు' (గొజ్జెగ పువ్వులు) ఆ కొప్పులో ముడిచి అలంకరించండి. అప్పుడా స్వామి పవిత్రమైన తన శరీరంపై సొమ్ములు (ఆభరణములు) తెప్పలుగా (ప్రోవుగా) ధరించి మిలమిల మెఱసి పోయాడు. ఓ చెలులారా! మీరింత హడావిడి చేస్తుంటే ఆయనకి దప్పికతో నోరెండిపోతుంది. అట్లాకాకుండా మీరు పూనుకొని కర్పూర తాంబూలమియ్యండి.

ఓ చెలులారా! తన హృదయంపై అలమేల్మంగను పెట్టుకొనిన ఆ శ్రీవేంకటేశ్వరుడు, గుబాళించు తులసి మాలలను తన మెడలో నిలువుగా ధరించాడు. ఆపై విజృంభించి తనకి నివేదించిన పదార్థములనారగించి కొలువు దీరియున్నాడు. మీకు ఆయనపైగల మోహమునంతా గుప్పించి "శ్రీవేంకటేశ చరణం శరణం ప్రపద్యే..." అని శరణాగతి నొందండి. తరించండి. మీపై దయతో ఆయన మీకిచ్చిన మానవజన్మను సార్థకం చేసికోండి.



Scanned with CamScanner

శ్రీరాగం

'బంగారు మేడలోన పరమాత్ముఁడు వాఁడే
సింగారాలు మీఁదమీఁద సేయరే చెలులు ‖పల్లవి‖

తట్టుపుణుఁగుల మేనె తగ నిండా నంటుకొని
గట్టిగాఁ గస్తూరి యట కలిపెట్టి
మట్టులేనిపన్నీట మజ్జనమాడె నిదె
పెట్టరీర నిందరును విసరరే చెలులు ‖బంగా‖

కప్పురపుగంధవొడి కడు నిట్టె మెత్తుకొని
కొప్పు దువ్వి ముడిచెను గొల్లంగలెల్లా
తెప్పలుగా నించుకొనె తిరుమేన సొమ్ములెల్లా
దప్పిదేర విడెమీరే తెంకొని చెలులు ‖బంగా‖

అలమేలుమంగ మరమందు నిట్టె నించుకొని
తలపిదంతలు పోఁచె నిలువునను
చెలరేఁగి యారగించె శ్రీవేంకటేశ్వరుఁడు
కొలువున్నాఁడు మోహాలు గుప్పరే చెలులు ‖బంగా‖ 3